## విద్యుత్తు చార్జీల పెంపు ప్రతిపాదనను తిరస్కరించాలి

**ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్**



హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్తు చార్జీలను పెంచాలని చేస్తున్న ప్రతిపాదనలను ఈఆర్సీ తిరస్కరించాలని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఈఆర్సీ) సభ్యుడిగా కంచర్ల రఘు నియమితుడైన సందర్భంగా ఆయన అభినందనలు తెలిపారు. కొత్తగా సభ్యుడైన రఘు.. ప్రజల పక్షాన ఉండాలని కోరారు. ఏడాదిన్నరగా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రతిపాదనను గత ఈఆర్సీ తిరస్కరించినట్టుగానే ప్రస్తుత ఈఆర్సీ కమిషన్ కూడా తిరస్కరించేలా చూడాలని ఈఆర్సీ సభ్యుడు రఘుకు దేశపతి శ్రీనివాస్ సూచించారు.

## ఎంసీహెచ్ఆర్డీ వైస్‌చైర్మన్‌గా శాంతి కుమారి

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): ఈనెల 30న ఉద్యోగ విరమణ చేయనున్న సీఎస్ శాంతికుమారిని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం (ఎంసీహెచ్ఆర్డీ) వైస్ చైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. దీంతోపాటు ఎంసీహెచ్ఆర్డీ డైరెక్టర్ జనరల్‌గా కూడా ఆమెకు అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్టు ప్రకటించింది. వేర్వేరు జీవోలను సోమవారం విడుదల చేసింది.

## ఆర్థిక ఇబ్బందులతో కాంట్రాక్టర్ ఆత్మహత్య

**భద్రాద్రి జిల్లా పాల్వంచలో ఘటన**

పాల్వంచ, ఏప్రిల్ 28 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్న ఉప్పల గిరీశం వెంకట్రామ్(58) నవభారత్ 150 మెగావాట్ల పవర్ ప్లాంట్‌లో సివిల్ కాంట్రాక్టర్‌గా చిన్నచిన్న పనులు చేపడుతుంటాడు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. అప్పులు తీరే పరిస్థితి లేకపోవడంతో సోమవారం పవర్ ప్లాంట్ టవర్‌లోని నీళ్లలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పాల్వంచ ఎస్సై సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ‘పెద్దలు’ గుర్తొస్తున్నారు!

- జానారెడ్డితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ
- ఏడాదిన్నర తర్వాత రెండు నెలల్లో రెండోసారి..
- రాజకీయాలపై గంటపాటు రహస్యంగా చర్చలు
- పెద్దలే దిక్కవుతున్నారంటూ కాంగ్రెస్‌లో సెటైర్లు



హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఈ మధ్య పదేపదే ‘పెద్దలు’ గుర్తుకొస్తున్నారనే చర్చ కాంగ్రెస్‌లో జోరుగా జరుగుతున్నది. పరిస్థితులు వ్యతిరేకంగా మారుతున్న నేపథ్యంలో నాడు వద్దనుకున్న పెద్దలే.. నేడు దిక్కవుతున్నారనే అభిప్రాయాలు పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి ఇంటికి సోమవారం మరో సీనియర్ నేత కే కేశవరావుతో కలిసి ముఖ్యమంత్రి వెళ్లడంపై ఈ చర్చ మొదలైంది. గత రెండు నెలల్లో రెండుసార్లు ఆయన జానారెడ్డికి ఇంటికి వెళ్లడంపై పార్టీ వర్గాలే విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. వాస్తవానికి జానారెడ్డితో కొంతకాలంగా సీఎం రేవంత్‌రెడ్డి అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారనే ప్రచారం పార్టీలో జరిగింది. వారిద్దరూ కలుసుకోకపోవడం కూడా ఈ ప్రచారానికి ఊతమిచ్చింది. మొదటిసారి 2023 డిసెంబర్ 11న అంటే సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత జానారెడ్డిని రేవంత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా వెళ్లి కలిశారు. అప్పటినుంచి ఇప్పటివరకు మళ్లీ ఆయన ఇంటికి సీఎం వెళ్లలేదు. గత నెల (మార్చి 6)న ఆకస్మికంగా సీఎం రేవంత్‌రెడ్డి జానారెడ్డి ఇంటిలో ప్రత్యక్షమయ్యారు. కుల గణన, ఎస్సీ వర్గీకరణ వంటి అంశాలు వివాదాస్పదమైన నేపథ్యంలో జానారెడ్డి సలహాలు సూచనల కోసం సీఎం వెళ్లినట్టు ప్రచారం జరిగింది. ఇప్పుడు మళ్లీ సోమవారం మరోసారి ఆయన జానారెడ్డి ఇంటికి వెళ్లారు. దీనిపై పార్టీ నేతల్లో పలు రకాల చర్చలు జరుగుతున్నాయి. బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం కావడం, కాంగ్రెస్ సర్కారు వైఫల్యాలను కేసీఆర్ ప్రజల్లో ఎండగట్టడం, సర్కారుపై బీఆర్ఎస్ యుద్ధం ప్రకటించడంతో ప్రభుత్వపరంగా నష్టనివారణ చర్యలు ప్రారంభించినట్టు తెలిసింది. అదేవిధంగా ఎప్పుడో జరుగుతుందనుకున్న మంత్రివర్గ విస్తరణకు బ్రేక్ పడింది. ఇలా అన్ని వైపుల నుంచి ఒత్తిడి పెరగడంతో పెద్దల సలహాలు తీసుకునేందుకు వెళ్లారనే చర్చ జరుగుతున్నది. గంటపాటు భేటీ జరిగితే ఇందులో అరగంటకు పైగా రహస్యంగా మాట్లాడుకున్నట్టు తెలిసింది. దీనిపై నాడు వద్దనుకున్న పెద్దలే.. నేడు దిక్కవుతున్నారా అనే సెటైర్లు పార్టీ వర్గాల్లో పేలుతున్నాయి.

## పరిపాలన గురించి ఎవరూ పట్టించుకోరు

మొదటిపేజీ తరువాయి...

సమావేశం అనంతరం మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదిన్నర కాలంగా అనేక పథకాలు తీసుకొచ్చామని, ఇప్పుడు వీటిని గాడిలో పెట్టడంపై దృష్టిసారిస్తామని చెప్పారు. మావోయిస్టులు, కగార్ అంశంపై జానారెడ్డితో చర్చించినట్టు తెలిపారు. ఈ అంశంపై పార్టీ అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటామని పేర్కొన్నారు. మావోయిస్టులతో శాంతి చర్చల్లో గతంలో ఈ ఇద్దరు నేతలు కీలకంగా వ్యవహరించడంతో అధిష్ఠానంతో చర్చించి మరోమారు వారికే బాధ్యత అప్పగిస్తామని తెలిపారు. రాహుల్‌గాంధీతో తనకు మంచి సంబంధాలు ఉన్నాయని, ఈ విషయంలో బయట ఎవరేమనుకున్నా తాను పట్టించుకోబోనని స్పష్టంచేశారు. మరో 20 ఏండ్లు తాను రాజకీయాల్లో ఉంటానని, చట్ట ప్రకారమే నడుచుకుంటానని, కక్ష సాధింపు రాజకీయాలు చేయబోనని అన్నారు. తాను మాట ఇస్తే నెరవేరుస్తానని, అందుకు అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ పదవే ఉదాహరణ అని చెప్పారు. కొందరు అధికారుల గురించి తెలిసినప్పటికీ వారిని కొనసాగించాల్సి వస్తున్నదని, వేరే మార్గం లేదని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి చెప్పిందే చేస్తడనే నమ్మకం ప్రజల్లో కలిగేలా పనిచేస్తానని సీఎం తెలిపారు.

## ఇండ్లున్నోళ్లకే ఇందిరమ్మ ఇండ్లా..?

- మంచిర్యాల జిల్లా ఎర్రగుంటపల్లి, లంబాడీతండాలో మహిళలు, గ్రామస్థుల ఆందోళన



చెన్నూర్ ఎంపీడీవో కార్యాయంలో ఎదుట బైఠాయించిన ఎర్రగుంటపల్లి గ్రామస్తులు

చెన్నూర్ రూరల్/కాసిపేట, ఏప్రిల్ 28 : ఇండ్లు, భూములు ఉన్నోళ్లకే ఇందిరమ్మ ఇండ్లు రాసిండ్రని మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం ఎర్రగుంటపల్లి గ్రామస్థులు సోమవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. 130 మంది దరఖాస్తు చేసుకుంటే.. అందులో వాళ్లకు నచ్చిన కాంగ్రెస్ నాయకులు, బంధువులను 35 మందిని ఎంపిక చేసినట్టు తెలిపారు. కాంగ్రెస్ నాయకుల ఆగడాలతో అసలైనవారికి ఇండ్లు రావడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ‘ఇందిరమ్మ ఇండ్లు కాంగ్రెస్ నాయకులు చెప్పినోళ్లకేనా.. మాలాంటి పేదోళ్లకు ఇవ్వరా’ అంటూ కాసిపేట మండలం లంబాడీతండా(ధర్మారావుపేట) వాసులు ఆందోళన వ్యక్తంచేశారు. సోమవారం ఇందిరమ్మ ఇళ్ల సర్వే కోసం గ్రామానికి వచ్చిన అధికారులను మహిళలు, గ్రామస్థులు అడ్డుకొని నిలదీశారు.

## హామీల్లో కొన్నింటినే అమలు చేశాం

- అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తే రద్దు చేస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

అశ్వారావుపేట, ఏప్రిల్ 28 : అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తే రద్దు చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఇందిరమ్మ కమిటీలు కూడా అర్హులను గుర్తించి ఇండ్లు మంజూరు చేయాలని సూచించారు. సోమవారం ఆయన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలో పర్యటించారు. కొన్ని హామీలను మాత్రమే అమలు చేస్తున్నామని, మిగతా వాటిని ఎందుకు అమలు చేయలేకపోతున్నామన్నది ప్రజలకు చెప్పలేమంటూ వ్యాఖ్యానించారు. ‘గూడులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయరా..? అని గుర్రాలచెరువు గ్రామానికి చెందిన మహిళలు మంత్రి పర్యటనలో అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు.



వెల్దండ మండలం చౌదర్‌పల్లిలో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థుల మధ్య వాగ్వాదం

## మా ఇష్టం వచ్చిన వారికే ఇండ్లు ఇస్తాం

**వెల్దండ మండలం చౌదర్‌పల్లిలో కాంగ్రెస్ నేతల దబాయింపు**

వెల్దండ, ఏప్రిల్ 28 : మా పార్టీ.. మా ఇష్టం.. ఇందిరమ్మ ఇండ్లు మా ఇష్టం ఉన్నవారికి ఇస్తాం.. అంటూ గ్రామ ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు బెదిరిస్తున్నారని నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం చౌదర్‌పల్లి గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సోమవారం చౌదర్‌పల్లిలో అర్హులైన తమకు ఇందిరమ్మ ఇండ్లు మంజూ రు చేయకుండా అనర్హులకు ఇచ్చారని ఆరోపించారు. ఇండ్లున్న వారి పేర్లు లిస్టులో ఉన్నాయని, ఇండ్లు లేని పేర్లులేవని తెలిపారు. ఇదేమిటని అడిగితే మా పార్టీ.. మా ఇష్టం.. అంటూ కాంగ్రెస్ నాయకులు దబాయించారు. దీంతో వారిమధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది.



లోకాయుక్త జస్టిస్ ఏ రాజశేఖర్‌రెడ్డి, ఉప లోకాయుక్త జస్టిస్ బీఎస్ జగ్జీవన్‌కుమార్‌తో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి

## లోకాయుక్త, ఉపలోకాయుక్తల ప్రమాణం

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ) : ఇటీవల నూతనంగా నియమితులైన లోకాయుక్త, ఉప లోకాయుక్తలు సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ లోకాయుక్తగా జస్టిస్ ఏ రాజశేఖర్‌రెడ్డి, ఉప లోకాయుక్తగా జస్టిస్ బీఎస్ జగ్జీవన్‌కుమార్‌తో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ప్రభుత్వ సలహాదారులు కే కేశవరావు, షబ్బీర్ అలీ, వేం నరేందర్‌రెడ్డి, సీఎస్, డీజీపీ, ఇతరశాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. వీరి పదవీకాలం 5 ఏండ్లు లేదా వారి వయసు 70 ఏండ్ల వరకు పదవిలో కొనసాగనున్నారు.

## ఆర్టీఐ ప్రధాన కమిషనర్‌గా చంద్రశేఖర్‌రెడ్డి!

- ఏడుగురు కమిషనర్ల నియామకం
- త్వరలోనే ఉత్తర్వులు వెలువడే అవకాశం

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) కమిషనర్ల నియామకానికి ఎట్టకేలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్‌తోపాటు ఏడుగురు కమిషనర్లను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు సమాచారం. ప్రధాన కమిషనర్‌గా ఐఎఫ్ఎస్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, కమిషనర్లుగా జర్నలిస్టు పీవీ శ్రీనివాసరావు, సీపీఆర్వోగా బోరెడ్డి అయోధ్యరెడ్డి, కప్పర హరిప్రసాద్, పీఎల్ఎన్ హరిప్రసాద్, రాములు, వైష్ణవి, పర్వీన్ మొహిసిన్‌ను ఎంపిక చేసినట్టు సమాచారం. సంబంధించిన ఫైల్‌ను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు పంపించినట్టు తెలుస్తున్నది. గవర్నర్ ఆమోదం తర్వాత ఉత్తర్వులు వెలువడనున్నట్టు అధికారులు వెల్లడించారు. ఈ విషయమై సోమవారం సాయంత్రం వరకు ఎలాంటి అధికారిక ఉత్తర్వులు వెలువడలేదు. కాగా, ఏడుగురు కమిషనర్లలో ముగ్గురు జర్నలిస్టులు ఉండడం గమనార్హం. 2023 ఫిబ్రవరి నుంచి ఆర్టీఐ అమలుకు సంబంధించిన కమిషనర్ల నియామకం జరగలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 15 నెలలు దాటినా నియామకాలు చేపట్టలేదు.

## సీఎం కార్యాలయం ప్రక్షాళన!

- సీపీఆర్వోగా అయోధ్యరెడ్డి తొలగింపు
- షానవాజ్ ఖాసిం, సంగీత సత్యనారాయణ బదిలీ
- సీఎంవో లీకులను అరికట్టేందుకేనంటూ ప్రచారం

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): పాలనాపరమైన నిర్ణయాలు తన కంటే ముందుగానే ప్రతిపక్ష నేతలకు తెలిసిపోతున్నాయని, సీఎంవో సిబ్బంది కొందరు కోవర్టు ఆపరేషన్ చేసి ప్రభుత్వం కదలికలను బయటకు చేరవేస్తున్నారని, ఈ లీకులను అరికట్టడంలో అధికారులు విఫలమవుతున్నారని సీఎం రేవంత్ అనుమానిస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఈ నేపథ్యంలోనే సీఎంవోను సమూలంగా ప్రక్షాళన చేస్తున్నట్టు సెక్రటేరియట్ వర్గాలు చెప్తున్నాయి. ప్రస్తుతానికి నలుగురు అధికారులను మారుస్తున్నట్టు తెలిసింది. వారి స్థానంలో కొత్తవారి కోసం అన్వేషణ ప్రారంభమైనట్టు సమాచారం. సీఎం చీఫ్ పీఆర్వో బోరెడ్డి అయోధ్యరెడ్డి, కార్యదర్శులు ఐఎఫ్ఎస్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, ఐపీఎస్ అధికారి షానవాజ్ ఖాసింను బదిలీ చేస్తున్నట్టు తెలిసింది. వీరిలో ఐఏఎస్ అధికారిణి సంగీత సత్యనారాయణను ఇప్పటికే బదిలీ చేశారు. వీరి స్థానంలో సీఎంవోను సమర్థంగా నిర్వహించగలిగే అధికారుల కోసం అన్వేషణ మొదలైనట్టు తెలిసింది.

**వాణిజ్య**



## మార్కెట్లోకి బీవైడీ సరికొత్త ఈవీ

**ప్రారంభ ధర రూ.41 లక్షలు**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: చైనాకు చెందిన ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ బీవైడీ..సరికొత్త మాడల్‌ను దేశీయ మార్కెట్‌కు పరిచయం చేసింది. 2025 ఏడాదికిగాను బీవైడీ సీల్ పేరుతో ఈ మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. మూడు రకాలుగా లభించనున్న ఈ కారు 61.44 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ ధర రూ.41 లక్షలు, 82.56 కిలోవాట్ల బ్యాటరీ మాడల్ రూ.45.70 లక్షలు, 82.56 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మరో మాడల్ ధర రూ.53.15 లక్షలుగా నిర్ణయించింది. పనితీరు, కంఫర్ట్, టెక్నాలజీ పరంగా భారీ మార్పులు చేసిన ఈ కారును అత్యధికంగా వృద్ధిని నమోదు చేసుకుంటున్న భారత్‌లో ప్రవేశపెట్టింది. 61.44 కిలోవాట్ల నుంచి 82.56 కిలోవాట్ల బ్యాటరీతో తయారైన ఈ కారు 510 కిలోమీటర్ల నుంచి 650 కిలోమీటర్ల వరకు మైలేజీ ఇవ్వనున్నది. ప్రీమియం ఇంటీరియర్‌తో తీర్చిదిద్దిన ఈ కారులో 15.6 ఇంచుల ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్. కేవలం 3.8 సెకండ్లలోనే 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్నది.

## 99 వేల దిగువకు పుత్తడి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: రికార్డు స్థాయిలో దూసుకుపోయిన బంగారం మళ్లీ అంతేవేగంతో తగ్గుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ బలహీనంగా ఉండటంతో దేశీయంగా ధరలు తగ్గుముఖం పట్టాయి. ఢిల్లీ బులియన్ మార్కెట్లో తులం బంగారం ధర రూ.99 వేల దిగువకు పడిపోయింది. రూ.1,000 తగ్గిన పదిగ్రాముల ధర రూ.98,400కి దిగొచ్చింది. అంతకుముందు ఇది రూ.99,400గా ఉన్నది. బంగారంతోపాటు వెండి ధరలు కూడా తగ్గాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు నిలిచిపోవడంతో కిలో వెండి రూ.1,400 తగ్గి రూ.98,500కి దిగొచ్చింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర ఒక్క శాతం తగ్గి 3,291 డాలర్లకు, వెండి 33 డాల్ల వద్ద కొనసాగుతున్నది.

## నాలుగేండ్ల కనిష్ఠానికి పారిశ్రామికం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: దేశీయ పారిశ్రామిక రంగం మళ్లీ పడకేసింది. తయారీ, గనులు, విద్యుత్ రంగాలు నిరాశాజనక పనితీరు కనబర్చడంతో గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను పారిశ్రామిక రంగం నాలుగేండ్ల కనిష్ఠ స్థాయి 4 శాతానికి పడిపోయింది. 2023-24 ఏడాదిలో నమోదైన 5.9 శాతంతో పోలిస్తే భారీగా తగ్గింది. 2020-21లో నమోదైన -8.4 శాతం తర్వాత ఇదే కనిష్ఠ స్థాయి కావడం విశేషం. ఆ తర్వాతి ఏడాది 2021-22లో 11.4 శాతం వృద్ధిని కనబరిచిన పారిశ్రామిక రంగం..ఆ మరుసటి ఏడాది 5.2 శాతంగా నమోదైనట్లు కేంద్ర గణాంకా శాఖ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. మరోవైపు, మార్చి నెలకుగాను ఇండస్ట్రీయల్ ప్రొడక్షన్ 3 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. క్రితం ఏడాది ఇదే నెలలో నమోదైన 5.5 శాతంతో పోలిస్తే సగానికి సగం పడిపోయింది. గత నెలలో తయారీ రంగం 3 శాతానికి పరిమితమవగా, గనులు 1.3 శాతం నుంచి 0.4 శాతానికి పడిపోగా, విద్యుత్ రంగంలో వృద్ధి 6.3 శాతానికి పరిమితమైంది. అలాగే డాటా, ఇన్‌ఫ్రా, నిర్మాణ రంగాల్లో వృద్ధి 7.4 శాతం నుంచి 6.8 శాతానికి తగ్గాయి. మరోవైపు, ఫిబ్రవరి 2025 గణాంకాలను కేంద్ర ప్రభుత్వం 2.7 శాతానికి తగ్గించింది. గతంలో 2.9 శాతంగా ఉన్నదని నివేదిక విడుదల చేసింది.

# అప్పు పుడ్తలేదు



## దేశంలో మహిళా ఆంత్రప్రెన్యూర్స్‌కు కష్టాలు

### ప్రతీ ముగ్గురిలో ఒకరికి దొరకని రుణ లభ్యత

### ఫలితం లేని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు

**బీడబ్ల్యూఏఐ-2025 రిపోర్టులో వెల్లడి**

*ఆ రంగం.. ఈ రంగం.. అన్న తేడా లేకుండా సత్తా చాటుతున్న స్త్రీలను ఆర్థిక ఇబ్బందులు మాత్రం వీడటం లేదు.*

*మహిళా అభ్యున్నతి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు ఏమాత్రం ఫలితాన్నివ్వలేకపోతున్నాయి. పథకాలు నిష్ప్రయోజనంగా మారుతున్నాయి.*

***ఈ ఏడాదికిగాను టైడ్ పేరిట బీడబ్ల్యూఏఐ విడుదల చేసిన ఓ నివేదిక.. దేశంలో మహిళా ఆంత్రప్రెన్యూర్స్ కష్టాలను ఏకరవుపెట్టింది. ప్రస్తుత విధానాల్లో మార్పుల ప్రాధాన్యతను చాటింది.***

న్యూఢిల్లీ, ఏప్రిల్ 28: మహిళా సాధికారతే మా లక్ష్యం అంటూ గద్దెనెక్కిన పాలకులు.. అధికారంలోకి రాగానే ఆ విషయాన్నే మర్చిపోతున్నారు. దేశంలో మహిళా ఆంత్రప్రెన్యూర్స్ ప్రస్తుతం ఎదుర్కొంటున్న సవాళ్లే ఇందుకు సజీవ సాక్ష్యం. ఏ బ్యాంకుకు వెళ్లినా.. మరే ఆర్థిక సంస్థను సంప్రదించినా చిన్నచూపే. ప్రభుత్వ పథకాలు సైతం ఎందుకూ పనికిరాకుండాపోతుండటం గమనార్హం. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు, ఇతర పట్టణాల్లో చిన్నచిన్న వ్యాపారాలు, సంస్థలను నిర్వహిస్తున్న మహిళలకు ఆసరానే కరువైందని ఈ ఏడాదికిగాను వ్యాపార నిర్వహణ వేదిక టైడ్ ద్వారా భారత్ వుమెన్ అస్పిరేషన్ ఇండెక్స్ (బీడబ్ల్యూఏఐ) సోమవారం విడుదల చేసిన నివేదిక చెప్తున్నది.

### అడుగడుగునా సవాళ్లే

తాజా సర్వే ప్రకారం దేశంలోని మహిళా ఆంత్రప్రెన్యూర్స్‌లో ప్రతీ ముగ్గురిలో ఒకరికి అప్పు పుట్టట్లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తున్న పథకాల ప్రయోజనాలూ అందడం లేదు. దీంతో తమ ఆలోచనలు, వ్యాపార-పారిశ్రామికాభివృద్ధికి అవసరమయ్యే ప్రత్యేక రుణ సదుపాయాలను ఏర్పాటు చేయాలని మహిళలంతా కోరుతున్నారు. సాంకేతికంగా, నైపుణ్యాలపరంగా తమకు మద్దతిస్తే అద్భుత ఫలితాలను సాధిస్తామన్న ధీమాను కూడా వారు వ్యక్తం చేస్తున్నారు. సరైన మార్గదర్శకత్వం, సహకారం ఉంటే మహిళలు వారి లక్ష్యాలను వేగంగా చేరుకుంటారన్న అభిప్రాయాలు సర్వేలో వ్యక్తమవుతున్నాయి. నారీశక్తి తదితర పథకాల లక్ష్యం కూడా నెరవేరుతుందని అంటున్నారు.

### మార్పు అవసరం

మహిళలపట్ల బ్యాంకర్లు, ఇతర రుణదాతల్లో నెలకొన్న అపనమ్మకం పోవాల్సిన అవసరం ఉందని ఈ సర్వే అభిప్రాయపడింది. పురుషులకు సులువుగా మంజూరవుతున్న రుణాల్లో.. స్త్రీల విషయానికొచ్చేసరికి అనేక ఆంక్షలుంటున్నాయని ఈ రిపోర్టు చెప్తున్నది. కాబట్టి ఈ పక్షపాత ధోరణి పోవాలని, ఇప్పుడున్న విధానాల్లో సవరణలు చేయాలని, మహిళలకు అన్నివిధాలా ప్రోత్సహించే పాలసీలు తేవాలని నిపుణులు సూచిస్తున్నారు. పూచీకత్తులేని సూక్ష్మ రుణాలిచ్చి ఆర్థికంగా, నైపుణ్యాలను పెంచి సమర్థవంతంగా మహిళా ఆంత్రప్రెన్యూర్స్‌ను తయారు చేయాలని ఎక్స్‌పర్ట్స్ సలహా ఇస్తున్నారు. కాగా, తమ రెండో ఎడిషన్ కోసం దేశవ్యాప్తంగా నాన్-మెట్రో నగరాల్లో 18-55 ఏండ్ల మధ్య వయసున్న 1,300 మందికిపైగా మహిళా ఆంత్రప్రెన్యూర్స్ అభిప్రాయాలను సేకరించి ఈ నివేదికను బీడబ్ల్యూఏఐ సిద్ధం చేసింది.

- ఆర్థిక, వ్యాపార నిర్వహణ నైపుణ్యాలను పెంచుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్న 58 శాతం మహిళా ఆంత్రప్రెన్యూర్స్.
- డిజిటల్ సామర్థ్యాలను పెంపొందించుకోవాలని కోరుకుంటున్న 12 శాతం మంది.
- నిధుల కోసం చేసే ప్రయత్నంలో కుటుంబంలోని మగవారిపై ఆధారపడాల్సిన పరిస్థితి. తమ ఎదుగుదలకు ఇదే ప్రధాన అడ్డంకిగా ఉందని చెప్తున్న దాదాపు 28 శాతం మంది.



*దేశంలోని మహిళా ఔత్సాహిక వ్యాపార, పారిశ్రామికవేత్తల్లో ఎక్కువమంది సూక్ష్మ, చిన్న సంస్థలనే నడిపిస్తున్నారు. వారి ఆలోచనల్ని విస్తృతపర్చుకోవాలని భావిస్తున్నా సరైన సహకారం లభించడం లేదు. ఫైనాన్స్, డిజిటలైజేషన్‌లో మద్దతు కొరవడింది. ఇప్పటికీ పురుషుల జోక్యం లేనిదే మహిళల అభివృద్ధికి ఆస్కారం లేకుండాపోతున్నది.*

**-గుర్జోధ్‌పాల్ సింగ్, టైడ్ ఇండియా సీఈవో**



## ఉద్యోగాలు కావాలి


**కొలువుల కోసం మహిళలు, ఫ్రెషర్స్ నుంచి డిమాండ్**

దేశంలో ఉద్యోగాల కోసం మహిళలు, ఫ్రెషర్స్ నుంచి భారీగా డిమాండ్ కనిపిస్తున్నది. ఈ ఏడాది తొలి త్రైమాసికం (జనవరి-మార్చి)లో వీరి నుంచే ఎక్కువగా ఉద్యోగ దరఖాస్తులున్నట్టు ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ వేదిక ‘అప్నా’ సోమవారం తెలిపింది. అప్నా తాజా నివేదిక ‘ఇండియా ఎట్ వర్క్-క్యూ1 2025’లో ఈ జనవరి-మార్చిలో కొలువుల కోసం ఏకంగా 1.81 కోట్ల అప్లికేషన్లు పెట్టుకున్నారని తేలింది. ఇది.. నిరుడు ఇదే వ్యవధితో పోల్చితే 30 శాతం ఎక్కువన్నది. ముఖ్యంగా మహిళల నుంచి 62 లక్షలకు పైగా ఉద్యోగ దరఖాస్తులు వచ్చాయని, గతంతో చూస్తే 23 శాతం అధికమని పేర్కొన్నది. అలాగే ఫ్రెషర్స్ నుంచి 66 లక్షల అప్లికేషన్స్ ఉన్నాయని, 46 శాతం పెరిగాయని వివరించింది.

### టెక్ హైరింగ్‌లో వరంగల్..

ఏఐ/ఎంఎల్, సైబర్ సెక్యూరిటీ, బిజినెస్ ఇంటిలిజెన్స్, డాటా సెంటర్స్ రంగాల్లో పని చేసేందుకు స్పెషలైజ్డ్ ప్రొఫెషనల్స్‌కు గిరాకీ ఉందని తాజా రిపోర్టులో తేలింది. ఈ క్రమంలోనే ఇండోర్, జైపూర్, లక్నో, రాజ్‌కోట్, వరంగల్ నగరాల్లో టెక్ హైరింగ్ బాగా జరుగుతున్నదని పేర్కొన్నది. ఢిల్లీ-ఎన్సీఆర్, బెంగళూరు, ముంబై నగరాలు ఈ విషయంలో ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్నా.. వరంగల్ వంటి నగరాలు వాటికి కొత్త ప్రత్యామ్నాయాలుగా ఎదగడం గమనార్హం.

### కేసీఆర్ దూరదృష్టితో..



తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక తొలి సీఎం కేసీఆర్ దూరదృష్టితో అభివృద్ధిని వరంగల్ వంటి ద్వితీయ శ్రేణి నగరాలకూ విస్తరింపజేయడం కలిసొచ్చింది. దీంతో స్వరాష్ట్రంలో అభివృద్ధి అంతటా వ్యాపించింది. ఐటీ, తయారీ, ఆటో తదితర కంపెనీలు ఇతర నగరాల్లోనూ ఏర్పాటయ్యాయి. ప్రధానంగా రాష్ట్ర రెండో ఐటీ హబ్‌గా వరంగల్ అవతరించింది. అక్కడ టెక్నాలజీ నిపుణులకు ఉద్యోగావకాశాలూ పెరుగుతున్నాయి. తాజా నివేదికే నిదర్శనం.

## ఏటీఎంల్లో రూ.100, 200 నోట్లను ఉంచండి

ముంబై, ఏప్రిల్ 28: ప్రధాన బ్యాంకులకు రిజర్వుబ్యాంక్ కీలక సూచన చేసింది. మార్కెట్లో నగదు కొరత తీవ్రతరమవుతున్న ప్రస్తుత తరుణంలో ఏటీఎంలలో రూ.100, రూ.200నోట్లను పంపిణీ చేసేలా చూడాలని సూచించింది. బ్యాంకులు, వైట్ లేబుల్ ఏటీఎం ఆపరేటర్లు దశలవారీగా ఈ ప్రతిపాదను అమలులోకి తేవాలని పేర్కొంది. ప్రస్తుతం మార్కెట్లో తరుచుగా వినియోగించే నోట్లను విరివిగా పెంపొందించే ప్రయత్నంలో భాగంగా అన్ని బ్యాంకులు, వైట్ లేబుల్ ఆపరేటర్లు తమ ఏటీఎంలలో రూ.100, రూ.200 డినామినేషన్ నోట్లను క్రమం తప్పకుండా పంపిణీ చేసేలా చూడాలని తన సర్క్యులర్‌లో పేర్కొంది. సెప్టెంబర్ 30, 2025 నాటికి దేశవ్యాప్తంగా ఉన్న 75 శాతం ఏటీఎంల్లో ఈ రెండు నోట్లలో కనీసం ఒక్క నోట్‌నైనా పంపిణీ చేయాలని పేర్కొంది.



## భారీగా లాభపడిన సూచీలు

ముంబై, ఏప్రిల్ 28: వరుసగా రెండు రోజులుగా తగ్గుతూ వచ్చిన సూచీలు కదంతొక్కాయి. భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితులు తగ్గుముఖం పట్టడంతోపాటు బ్లూచిప్ సంస్థల షేర్లతోపాటు ప్రైవేట్ బ్యాంకులు, విదేశీ మదుపరులు భారీగా నిధులు కుమ్మరించడంతో సెన్సెక్స్ 80 వేల పాయింట్లను మళ్లీ తచ్చాడింది. చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 1,005.84 పాయింట్లు లేదా 1.27 శాతం ఎగబాకి 80,218.37 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 289.15 పాయింట్లు(1.20 శాతం) అందుకొని 24,328.50 వద్ద స్థిరపడింది. ఐటీ రంగ షేర్లు భారీగా నష్టపోయినప్పటికీ ఫార్మా, ఎనర్జీ, వాహన రంగ షేర్లకు లభించిన మద్దతుతో సూచీలు కోలుకున్నాయని దలాల్ స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. దేశీయ కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ అత్యధికంగా 5.27 శాతం ఎగబాకి టాప్ గెయినర్‌గా నిలిచింది.